GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

Spot Speed NEWS

T MEDIA

న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ

APGVB రోడ్, మామిళ్ళగూడెం, ఖమ్మం. సెల్ : 8919710365

మా సేవలు : ఉపన్యాసాలకు పాయింట్లు,
ప్రెస్ నోట్స్, ప్రత్యేక సంచికలు, యాడ్ డిజైన్స్, పేజ్ మేకింగ్
Please Subscribe : tmedia.net.in

సంపుటి : 6 | సంచిక : 244 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | బుధవారం 24-04-2024 | పేజీలు : 3

## ముస్లింల ఓట్లపై నేతలు కన్ను..

# సీట్లు గెలుస్తారా..

- ఓట్లు చీల్చి బీజేపీకి సహకరించేనా
- బెంగాల్‌లో సిద్ధిక్ అద్భుతాలు చేయగలడా?
- అస్సాంలో అజ్మల్ మేజిక్ పునరావృతమయ్యేనా?

**టీ మీడియా, ఏప్రిల్ 23,ఢిల్లీ:**
రాజకీయాల్లో అందరూ ఆదర్శాలు మాట్లాడతారు. కులమతాలకు అతీతంగా అందరినీ సమానంగా చూడాలని నీతులు చెబుతుంటారు. కానీ తీరా ఎన్నికలు వచ్చేసరికి.. అందరూ ఆ తాను ముక్కలే అన్నట్టుగా కులాలు, మతాల ఆధారంగానే సమాజాన్ని చీల్చి ఓట్లు దండుకోవాలని చూస్తుంటారు. ఇప్పుడు దేశమంతటా సార్వత్రిక ఎన్నికల వేడి రగులుకుంది. ఇప్పటికే మొదటి దశ పోలింగ్ పూర్తిచేసుకుని, 2వ దశ పోలింగ్ వైపు వడివడిగా దేశం అడుగులు వేస్తోంది. సంపూర్ణ మెజారిటీతో వరుసగా పదేళ్లపాటు అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ మరోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్లూరుతుంటే.. కమలదళం ఆధిపత్యానికి చెక్ పెట్టి అధికారం సాధించాలని విపక్ష కూటమి కలలు కంటోంది. మొత్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకట్టుకునేందుకు విన్యాసాలు చేస్తున్న సమయంలో ఎన్నికల్లో ప్రభావవంతమైన సమూహంగా ఉన్న ముస్లింలు ఎటువైపు అన్నదే చర్చనీయాంశంగా మారింది. ముస్లిం సమాజంలో దేశవ్యాప్త గుర్తింపు పొందిన కొందరు నేతలు.. యావత్ ముస్లిం సమాజానికి తామే ప్రతినిధులం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అలాంటివారిలో 'ఆలిండియా మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్' అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ఆలిండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు బద్రుద్దీన్ అజ్మల్, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్‌అబ్బాస్ సిద్ధిఖీతో పాటు మరికొందరు నేతలున్నారు. అజ్మల్ అస్సాంకు, సిద్ధిఖీ పశ్చిమ బెంగాల్‌కు పరిమితమవగా%ొ% అసదుద్దీన్ ఓవైసీ హైదరాబాద్ కేంద్రంగా దేశవ్యాప్తంగా రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్నారు. యావత్ ముస్లిం సమాజానికి అసలు సిసలు ప్రతినిధిగా తనను తాను తీర్చిదిద్దుకునే ప్రయత్నంలో ఉన్నారు. ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకించే భారతీయ జనతా పార్టీని ఓడించేందుకు ఈ నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించేనా.. లేక బీజేపీ వ్యతిరేక ఓటును చీల్చి పరోక్షంగా సహకరించేనా అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



### అస్సాంలో అజ్మల్ మేజిక్ పునరావృతమయ్యేనా?

బద్రుద్దీన్ అజ్మల్ అస్సాం రాజకీయాల్లో ప్రముఖ ముస్లిం నేత. ముస్లిం ఓట్లతో కింగ్ కాలేకపోయినా 'కింగ్‌మేకర్'గా ఎదగాలన్నది ఆయన అభిలాష, చిరకాల వాంఛ. ఈసారి రాష్ట్రంలోని 14 లోక్‌సభ స్థానాల్లో 3 స్థానాల్లో పోటీ చేస్తానని ప్రకటించారు. అస్సాం జనాభాలో దాదాపు 34 శాతం మంది ముస్లింలు ఉన్నారు. ఈ ముస్లిం ఓట్ల సాయంతో బద్రుద్దీన్ అజ్మల్ 2009 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. 2014లో అజ్మల్ స్వయంగా మూడు సీట్లు గెలుచుకోగా, 2019లో ఆ సంఖ్య ఒక్క సీటుకు తగ్గింది. ఈసారి %ూ×ఖణఖీ% తన అభ్యర్థులను మూడు లోక్‌సభ స్థానాల్లో నిలబెట్టింది. ఇందులో బద్రుద్దీన్ అజ్మల్ నాలుగో సారి ధుబ్రి స్థానం నుండి పోటీ చేస్తున్నారు. ఆయన పార్టీ తరఫున మరో రెండు లోక్‌సభ స్థానాలు నాగాంవ్, కరీంగంజ్ నుంచి అభ్యర్థులను బరిలోకి దించింది. కరీంగంజ్ నుంచి సహబుల్ ఇస్లాం చౌదరి పోటీ చేస్తుండగా.. నాగాంవ్ నుంచి అమీనుల్ ఇస్లాం బరిలో ఉన్నారు. ధుబ్రి, నాగాంవ్, కరీంగంజ్ స్థానాల్లో పెద్ద సంఖ్యలో ముస్లిం ఓటర్లు ఉన్నారు. వాటిలో పార్టీ అధినేత బద్రుద్దీన్ అజ్మల్‌కు ధుబ్రి కంచుకోట. వరుసగా మూడుసార్లు గెలుపొందిన ఆయనకు ఈసారి మాత్రం గట్టి సవాలు ఎదురైంది. కరీంగంజ్, నాగాంవ్ స్థానాలను బీజేపీ చేజిక్కించుకోవడం కోసం బలమైన అభ్యర్థులను బరిలోకి దించింది. ఈ పరిస్థితుల్లో ముస్లిం ఓట్లను కాపాడుకుంటూ 2014 తరహాలో విజయాన్ని పునరావృతం చేయడమే అజ్మల్ ముందున్న అతిపెద్ద సవాలుగా మారింది.

### బెంగాల్‌లో సిద్ధిక్ అద్భుతాలు చేయగలడా?

పశ్చిమ బెంగాల్‌లో 30 శాతానికి పైగా ముస్లిం ఓటర్లు ఉన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో గంపగుత్తగా ఒకవైపు నిలబడగలిగే సమూహం ఎన్నికల రాజకీయాల్లో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే శక్తిగా ఉంటుంది. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల తర్వాత తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ముస్లింల మద్దతుతో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. కానీ ఇప్పుడు ఫుర్ఫురా షరీఫ్‌కు చెందిన పిర్జాదా అబ్బాస్ సిద్ధిఖీ ముస్లింల గొంతుకగా నిలబడే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (%×ూఖీ%) అనే రాజకీయ పార్టీని కూడా స్థాపించారు. కాంగ్రెస్, వామపక్షాలు ఒక్క సీటు కూడా గెలవలేకపోయినా, ఐఎస్ఎఫ్ నుంచి నౌషాద్ సిద్ధిఖీ విజయం సాధించారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో అబ్బాస్ సిద్ధిఖీ 30 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టారు. ముఖ్యంగా ముస్లిం సామాజికవర్గం ఎక్కువగా ఉండే స్థానాల్లో ఆ పార్టీ పోటీ చేస్తోంది. పిర్జాదా ఎంట్రీతో కాంగ్రెస్-లెఫ్ట్‌లకే కాకుండా మమతా బెనర్జీకి కూడా ఆందోళన పెరిగింది. రాష్ట్రంలోని 42 లోక్‌సభ స్థానాలకు గాను 30 స్థానాల్లో పోటీ ఆ పార్టీ పోటీ చేస్తోంది. అయితే ఆ పార్టీ ఏకైక ఎమ్మెల్యే నౌషాద్ సిద్ధిఖీ డైమండ్ హార్బర్ స్థానం నుండి అభిషేక్ బెనర్జీపై పోటీ చేస్తానని తొలుత ప్రకటించి తరువాత వెనక్కి తగ్గారు. రాష్ట్రంలో ముస్లిం ఓట్లతో గుత్తాధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న మమతా బెనర్జీకి ఈ పార్టీ ఒక పెద్ద సవాలుగా మారింది. ఈ పార్టీ ఎన్ని సీట్లు గెలుస్తుంది? అసలు గెలుస్తుందా.. లేదా? అన్న విషయాన్ని పక్కనపెడితే.. ముస్లిం సమాజం నుంచి చీల్చే ప్రతి ఓటూ బీజేపీకి లాభించేదిగానే పరిగణించాల్సి ఉంటుంది. అది తృణమూల్ విజయావకాశాలను దెబ్బతీస్తుంది. అయితే బెంగాల్ ముస్లిం సమాజం బీజేపీని ఓడించే క్రమంలో రాష్ట్రంలో బలమైన రాజకీయ ప్రత్యర్థి తృణమూల్ కాంగ్రెస్‌కు ఓటేస్తుందా.. లేక తమ గొంతుకగా మారి నిలబడ్డ ఐఎస్ఎఫ్‌కు ఓటేస్తుందా అన్నది మాత్రం ప్రస్తుతానికి ఎవరికీ అంతుచిక్కడం లేదు.

### ముస్లింల గొంతుకగా ఒవైసీ..

మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఇప్పటికే వరుసగా 4 పర్యాయాలు గెలుపొందిన హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి మరోసారి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్రలోని ఔరంగాబాద్ సీటును కూడా ఆ పార్టీ కైవసం చేసుకోగా, కిషన్‌గంజ్‌లో కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయింది. ఔరంగాబాద్ నుంచి ఇంతియాజ్ జలీల్ విజయం సాధించారు. ఈసారి ఈ మూడు లోక్‌సభ స్థానాల్లో ఒవైసీ పోటీ చేస్తున్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తన పార్టీని విస్తరింపజేసేందుకు చాలాకాలంగా ఓవైసీ ప్రయత్నిస్తున్నారు. ముస్లిం సమాజానికి గొంతుకగా మారి, వారి సమస్యలపై గళమెత్తుతూ ఉన్నారు. ముస్లింల హక్కుల కోసం నినదిస్తూ వచ్చారు. అయితే తాము తీవ్రంగా వ్యతిరేకిస్తూ బీజేపీని ఓడించడం కోసం ఓవైసీ చేస్తున్న ప్రయత్నాలు ఒక్కోసారి బెడిసికొట్టి ప్రత్యర్థికే లాభించేలా చేస్తున్నాయి. బీజేపీ వ్యతిరేక ఓటును చీల్చి పరోక్షంగా ఆ పార్టీ గెలుపొందడానికి దోహదం చేస్తున్నాయి. దీంతో ప్రతిపక్ష పార్టీలు సైతం ఓవైసీని బీజేపీకి బీ-టీమ్‌గా చిత్రీకరిస్తూ విమర్శిస్తూ వచ్చాయి. ఈ పరిస్థితుల్లో తాము గెలవడానికి ఆస్కారం ఉన్న చోట మాత్రమే పోటీ చేయాలని ఓవైసీ నిర్ణయించుకున్నారు. ఫలితంగా మిగతా నియోజకవర్గాల్లో బీజేపీ వ్యతిరేక ఓటు

చీలకుండా ఉంటుందని భావిస్తున్నారు. అందులో ముస్లిం జనాభా పెద్ద సంఖ్యలో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో ఒక్క సీట్లో కూడా తమ అభ్యర్థులను బరిలోకి దించలేదు. రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, జార?ండ్ రాష్ట్రాల్లోనూ ఎంఐఎం పోటీ చేయడం లేదు. బీహార్, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపుతామని ముందుగా ప్రకటించినప్పటికీ తన నిర్ణయాన్ని మార్చుకుని ఎంపిక చేసిన స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లింలు అధికంగా ఉండే సీమాంచల్ ప్రాంతంలో ఎంఐఎం గెలుపొందిన ఎమ్మెల్యేల్లో నలుగురు ఆర్జేడీలో చేరిపోగా.. పార్టీకి అండగా నిలిచిన ఏకైక ఎమ్మెల్యే అకర్తుల ఇమాన్. అందుకే ఒవైసీ మరోసారి కిషన్‌గంజ్ లోక్‌సభ స్థానం నుండి అక్తరుల్ ఇమాన్‌ను పోటీకి దింపారు. ఈ కారణంగా బీహార్‌లోని మిగిలిన స్థానాల్లో ఎన్నికలను పోటీ చేసే వ్యూహాన్ని ఆయన వాయిదా వేశారు. మొత్తంగా అసదుద్దీన్ ఒవైసీ భారత రాజకీయాల్లో ముస్లిం సమాజ ప్రతినిధిగా స్థిరపడేందుకు ప్రయత్నిస్తున్నారు.


### బీ టీం ఎవరు.. ?

దేశంలో ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ఓవైపు, కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండి-కూటమి మరోవైపు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఈ పోటీలో ముస్లిం ఓటింగ్ సరళి రాజకీయ పార్టీల్లో టెన్షన్ పెంచుతోంది. ప్రాంతీయంగా ఉన్న ముస్లిం రాజకీయ పార్టీలవైపు నిలబడితే పరోక్షంగా బీజేపీకి లాభం చేస్తుందన్న విషయాన్ని ఆ సమాజం గుర్తించింది. అందుకే చాలా వరకు విపక్ష కూటమికి అండగా నిలవాలని భావించినట్టు తెలుస్తోంది. మత పెద్దలు సైతం వారిని ఆ దిశగా నడిపిస్తున్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి. ఓవైసీ వంటి నేతలు సైతం దేశవ్యాప్తంగా పోటీ నుంచి విరమించుకుని, ఎంపిక చేసిన 3 స్థానాలకు మాత్రమే పరిమితమవడం కూడా ఇందులో భాగమేనని అర్థం చేసుకోవచ్చు. అయితే బెంగాల్‌లో సిద్ధిఖీ మాత్రం విపక్ష కూటమితో సంబంధం లేకుండా పోటీ చేస్తుండడం, తృణమూల్ కాంగ్రెస్ ఓటుబ్యాంకును దెబ్బకొట్టేలా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. గతంలో ఓవైసీ ఎదుర్కొన్నట్టే, ఇప్పుడు సిద్ధిఖీని కూడా బీజేపీ బి-టీమ్‌గా పిలుస్తున్నారు. వీరితో పాటు కేరళలోనూ ముస్లిం సమాజానికి ప్రాతినిధ్యం వహించేలా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి కొన్ని పార్టీలు ఉన్నప్పటికీ, చాలావరకు అవన్నీ ప్రతిపక్ష కూటమి భాగమయ్యాయి. దాంతో బీజేపీ వ్యతిరేక ఓటు చీలుతుందన్న ఆందోళన లేదు. మొత్తంగా ముస్లిం సమాజం ఓట్లు ఈ ఎన్నికల్లో కీలకం కానున్నాయి.

## అప్పట్లో వైయస్సార్.. ఇప్పుడు జగన్

### కిడ్నీ బాధితులకు సీఎం హామీ..

**టీ మీడియా ,ఏప్రిల్ 23, ఉద్దానం :** మేమంతా సిద్ధం బస్సుయాత్రలో ఉద్దానం కిడ్నీ బాధిత కుటుంబం సీఎం జగన్‌ను కలిశారు. కిడ్నీ బాధిత కుటుంబంతో ప్రత్యేకంగా మాట్లాడిన సీఎం జగన్.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా.. కిడ్నీ బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం జగన్‌ను కలవడం సంతోషంగా ఉందన్నారు ఉద్దానం కిడ్నీ బాధితులు.. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ బాధితులను ఆదుకోవాలని కోరామన్నారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ బాధితులకు మందుల కోసం నెలకు 12వేలు ఖర్చు అవుతుదని సీఎం జగన్‌కు చెప్పినట్లు తెలిపారు. ఇప్పుడు ఇస్తున్న 5వేల పెన్షన్‌తోపాటు.. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ బాధితులకు మందులు కూడా ఇస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారన్నారు కిడ్నీ బాధిత కుటుంబం. కిడ్నీ బాధితులను గతంలో వైయస్సార్.. ఇప్పుడు సీఎం జగన్ ఆదుకుంటున్నారన్నారు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ బాధితుడు. జగన్ అధికారంలోకి వచ్చాకే కిడ్నీ బాధితులకు రూ.5వేలు పెన్షన్ ఇస్తున్నారని.. మళ్లీ అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీలోనే మందులు కూడా ఫ్రీగా ఇస్తామని తెలిపారన్నారు ఉద్దానం బాధితులు..



## మోడీ విద్వేష పూరిత వ్యాఖ్యలు

### ఖండించిన పినరయి విజయన్



**టీ మీడియా, ఏప్రిల్ 23,తిరువనంతపురం :**
ముస్లింలపై ప్రధాని మోడీ విద్వేషపూరిత వ్యాఖ్యలను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. దేశ ప్రజాస్వామ్యం, లౌకిక విలువలపై దాడిగా పేర్కొన్నారు. పరోక్షంగా ముస్లింలను చొరబాటుదారులని, దేశ సంపదను దోచుకోవాలని చూస్తున్నారని ప్రధాని మోడీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రధాని స్వయంగా ఇటువంటి మతతత్వ వ్యాఖ్యలు చేయడం దేశంలో ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు ఎదుర్కొంటున్న బెదిరింపులకు స్పష్టమైన నిదర్శనమని అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఎలక్షన్ కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారదర్శకంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఎన్నికలు జరిగేలా చూసేందుకు అన్ని ప్రగతిశీల, లౌకిక శక్తులు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. భారతదేశ లౌకిక ఆధారాలను, మతసామరస్యాన్ని దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రతిఘటించాలని అన్నారు.

## ఎపి, తెలంగాణలో నామినేషన్ల సందడి

- పిఠాపురం జనసేన అభ్యర్థి పవన్‌కల్యాణ్‌నామినేషన్
- ఖమ్మం ఎంపీ స్థానానికి కాంగ్రెస్ నేత రఘురాంరెడ్డి

**టీ మీడియా ,ఏప్రిల్ 23, హైదరాబాద్ బ్యూరో :**
ఎపి తెలంగాణలలో నామినేషన్ల సందడి కొనసాగుతోంది. ప్రధాన పార్టీల తరఫున అభ్యర్థులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు (ఆర్వో) సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీల్లో ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో కోలాహలం నెలకొంది.ఏపీలో పిఠాపురం జనసేన అభ్యర్థిగా ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, గుడివాడ అసెంబ్లీ టిడిపి అభ్యర్థిగా వెనిగండ్ల రాము నామినేషన్ దాఖలు చేశారు. ధర్మవరం అభ్యర్థిగా సత్యకుమార్ (భాజపా), చిలకలూరిపేట నుంచి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు (తెదేపా), నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి (వైకాపా) నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. నంద్యాల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి ఆయన నామినేషన్ పత్రాలను అందజేశారు.



### తెలంగాణలో..

తెలంగాణలో పలువురు లోక్‌సభ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. చేవెళ్ల స్థానం నుంచి రంజిత్‌రెడ్డి (కాంగ్రెస్), కాసాని జ్ఞానేశ్వర్ (భారాస) నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. నల్గొండ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి (కాంగ్రెస్) నామపత్రాలను సమర్పించారు. ఖమ్మం ఎంపీ స్థానానికి కాంగ్రెస్ నేత రఘురాంరెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందించారు. అయితే ఖమ్మం స్థానంలో అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.
నామినేషన్ దాఖలు చేసిన మాలోతు కవిత
మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా మాలోతు కవిత రెండు సెట్లతో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌కి అందజేశారు

### నల్గొండలో కంచర్ల..

నల్లగొండ పార్లమెంట్ స్థానానికి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి రెండు సెట్లతో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు అందజేశారు.



అదిలాబాద్ లో ఆత్రం సక్కుఆదిలాబాద్ స్థానానికి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా ఆత్రం సక్కు రెండు సెట్లతో తన నామినేష పత్రాలను రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు అందజేశార

### 'బర్రెలక్క' నామినేషన్..

నాగర్ కర్నూల్ లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బర్రెలక్క నేడు నాగర్ కర్నూల్ కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

# కుగ్రామం కఠిన నిర్ణయం

• నేతలకు షాక్ ఇస్తూ తీర్మానం


టీ మీడియా, ఏప్రిల్ 23,మంచిర్యాల :
గోదావరి పరివాహక ప్రాంతానికి అనుకొని ఉన్న కుగ్రామం అది. ప్రభుత్వాలు మారిన రాష్ట్రాలు, మండలాలు మారినా ఆ గ్రామంలో మాత్రం చూద్దామన్నా అభివృద్ధి సాగడం లేదు. కనీస మౌలిక వసతులు కూడా లేక నానా ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు వారంతా. పాలకులు, అధికారులకు తమ గ్రామం గోడు చెప్పుకుని అలసిపోయిన గ్రామస్తులు తాజాగా ఓ కఠిన నిర్ణయం తీసుకున్నారు. తమ గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడని అధికారులకు,ప్రజాప్రతినిధులకు షాక్ ఇచ్చేలా సమిష్టి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు ఈ నిర్ణయమే ఆ గ్రామాన్ని వార్తల్లో నిలిపింది.మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని రాజారం గ్రామం. వందకు పైగా గడపలున్న గ్రామం. వ్యవసాయమే ఆధారంగా ఇక్కడి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు ఈ గ్రామస్తులంతా కలిసి సమిష్టి తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకోవడమే..!దశాబ్దానికి పైగా తమ గ్రామంలో మౌలిక వసతుల కల్పన లేదని, తాజాగా గెలిచిన కాంగ్రెస్ కూడా తమ గ్రామాన్ని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓట్లప్పుడు తప్ప మరెప్పుడు మా గ్రామానికి ప్రజాప్రతినిధుల అవసరం పడటం లేదని గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఇక అలా అయితే కుదరదని ఎన్నికలకు దూరంగా ఉంటేనే తమను అధికారులు గుర్తిస్తారేమో అన్న నిర్ణయానికి వచ్చింది రాజారాం గ్రామం.తమ గ్రామ సమస్యలను తీర్చే వరకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకి కూడా ఓటెయ్యబోమని తీర్మానం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు ఇక్కడి ప్రజలు. పాలకులు మారిన ప్రభుత్వాలు మారినా మా తల రాతలు మాత్రం మారడం లేదని గ్రామస్తులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ ఈ కఠన నిర్ణయం తీసుకున్నారు. సుమారు వెయ్యి మంది ఓటర్లు కలిగిన ఈ గ్రామంలో ప్రతీ ఎన్నికల ముందు గ్రామంలో నెలకొన్న సమస్యలపై నాయకుల దృష్టికి తీసుకెళ్లినా, తీరు మారలేదు. ఇచ్చిన హామీలు నీటి మీద రాతలుగానే మిగిలాయని వారు స్పష్టం చేశారు.ప్రధానంగా గ్రామంలో తాగునీరు లేక అల్లల్లాడుతున్నారు. రవాణా మార్గం సరిగా లేక తాము నరకయాతన పడుతున్నామని గ్రామస్తులు పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడితే తమ సమస్యలు తీరుతాయని ఎంతో ఆశతో ఉన్న మాకు ఆశలు అడియాశలుగానే మిగిలాయని వారు తెలిపారు. తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను తీర్చే వరకు తాము వెనుకడుగు వేయబోమని ఇకనైనా పాలకులు,అధికార యంత్రాంగం స్పందించి తమ సమస్యలను తీర్చాలని గ్రామస్తులు వేడుకొంటున్నారు.




# ప్యాకేజీ పార్టీ కాదు-సిపిఎం ప్రజాస్వామ్య పార్టీ

• సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

టీ మీడియా, ఏప్రిల్ 23,రంపచోడవరం (అల్లూరి) :
ప్యాకేజీ పార్టీ కాదు-సిపిఎం ప్రజాస్వామ్య పార్టీ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గిరిజన ప్రాంత పరిరక్షణ, అభివృద్ధి కోసం ఇండియా కూటమి బలపరిచిన అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట.అప్పలనర్సకి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం డుంబ్రిగుడ మండలం పోతంగి పంచాయతీ పెద్దపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ %" % ప్యాకేజీ పార్టీ సిపిఎం కాదని ప్రజాస్వామ్య పార్టీ అని అన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ విప్లవ పార్టీ ఎర్రజెండా పార్టీ అని చెప్పారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్.పోతురాజు, టి.సూర్యనారాయణ మాట్లాడుతూ %" % కోసంగినుండి పెద్దపాడు వరకు సుమారు 8 గ్రామాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. రోడ్డు పనులు ఆగిపోయాయని చెప్పారు. చాపరాయి మిద్దగా బ్రిడ్జి నిర్మాణం ఏర్పాటు చేసి 8 గ్రామ ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొర్ర.భాస్కరావు, కొర్ర.దివ్య పాంగి.ఇంద్ర, వంతల.సుబ్బారావు, కొర్ర.నాయుడు, యేడబోయి.తౌడన్న, తదితరులు పాల్గొన్నారు.





## ఎన్డీఏ కూటమి ఆత్మీయ సమావేశం

టీ మీడియా, ఏప్రిల్ 23, మహానంది:
మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని మెట్ట యందు బిజెపి నాయకులు పి .నాగేశ్వరరావు స్వగృహం వద్ద ఎన్డీఏ కూటమి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి, ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.అలాగే శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, ఎన్డీఏ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డిని, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం సాధించేందుకు, ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

టీ మీడియా ,ఏప్రిల్ 23, జిన్నారం :
మండలంబొల్లారం మున్సిపాలిటీ పరిధిలో హనుమాన్ జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లారం ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో నాయకులు, యువకులు హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, హనుమాన్ ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి దేవతల గుట్ట రామాలయం వరకు భారీ ఎత్తున కాషాయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో మున్సిపల్ వీధులన్నీ మార్మోగిపోయాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి మాట్లాడుతూ... రామబంటు హనుమాన్ లోక రక్షకుడని అన్నారు. హనుమాన్ నామమే ధైర్య సాహసాలకు మారుపేరని కీర్తించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పెద్దలు భాస్కర్ రెడ్డి , కృష్ణ రెడ్డి , యాది రెడ్డి , లక్ష్మా రెడ్డి ఆనంద్ రెడ్డి , అనంత్ రెడ్డి , రాజ్ శేఖర్ రెడ్డి , తిరుపతి రెడ్డి , కిరణ్ రెడ్డి , మల్లారెడ్డి , లోకేష్ రెడ్డి పాండురంగా రెడ్డి , శ్రీకాంత్ రెడ్డి ఉదయ్ , శ్రీకాంత్ యాదవ్ పద్మ , స్థానిక నాయకులు, యువకులు, హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

టీ,మీడియా, ఏప్రిల్,23 ఆత్మకూరు:
పట్టణ కేంద్రంలో కేశవ నగర్ లో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు,స్వామి వారికి తెల్లవారుజామున నుంచి అభిషేకం ఆకు పూజ జరిపి ఆభరణాలను అలంకరించారు. అనంతరం స్వామివారి మంగళహారతీతో దర్శన ఏర్పాటు చేశారు. మహిళలు హనుమాన్ పారాయణం చేశారు, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు,స్వామి వారి ఊరేగింపు అంగరంగ వైభవంగా పురవీధుల్లో భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ శోభయాత్రగా సాగింది. ఇట్టి కార్యక్రమంలో సహదేవుడు (తిరుమల సప్లయర్స్), సింగం ఉదయ్ (రైస్ మిల్), మహేష్ కదుమూరు, పట్టాభి శంకర్, డీకే రవి, జిన్నారం నరేష్, మస్తీపురం బాలరాజ్, శ్రీధర్, రాజు( వెండి వర్క్) టైలర్ శీను, రఘు, నవీన్, మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేశారు



## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

టీ మీడియా, ఏప్రిల్ 23, గోదావరిఖని ప్రతినిధి:
నియోజకవర్గంలోని పలు గ్రామాలు, రామగుండం కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో మంగళవారం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ దంపతులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కన్ సింగ్ మాట్లాడుతూ రామగుండం ప్రజలు సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ఉండాలని తన నియోజకవర్గంలో ఎవరికి ఆపతి వచ్చినా ఆ ఆంజనేయుడు ఏ విధంగా సంజీవని తీసుకొచ్చి లక్ష్మణుని ప్రాణాలు కాపాడినట్టుగా రామగుండం అక్కచెల్లెమ్మల, అన్నదమ్ములకు తాను అన్ని విధాలుగా ఉండే ఆ హనుమంతుడిలా ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం వివిధ ఆలయాల్లో పాల్గొని, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



# కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

• తప్పిన పెనుప్రమాదం

టీ మీడియా, ఏప్రిల్ 23,ముత్తారం :
పెద్దపల్లి జిల్లాలో మానేరు నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోయింది. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ముత్తారం మండలం ఓడేడు గ్రామం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గర్మిళపల్లి మధ్య దూరం తగ్గించేందుకు వాగుపై ఈ వంతెన నిర్మిస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్గంలో స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో వంతెన కూలడంతో పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం స్థానికులు గమనించి అధికారులకు సమాచారం ఇచ్చారు. పగటివేళ రాకపోకల సమయంలో బ్రిడ్జి కూలిఉంటే పెనుప్రమాదం సంభవించేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మానేరు నదిపై 2016 సంవత్సరం ఆగస్టు నెలలో రూ.49కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తొమ్మిదేళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు ఇంకా పూర్తికాలేదు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వంతెన ఫిల్లర్లు కుంగిపోయాయి. సోమవారం రాత్రి ఈదురు గాలుల బీభత్సంకు బ్రిడ్జిపై ఉన్న సిమెంట్ గైడర్లు కిందపడిపోయాయి.. దీంతో బ్రిడ్జి కుప్పకూలింది. నిర్మాణంలో నాణ్యతాలోపాలే బ్రిడ్జి కూలిపోవటానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జి వాడుకలోకి వచ్చిన తరువాత కూలిపోతే పెద్ద ప్రమాదమే జరిగేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బ్రిడ్జి కూలిన ఘటనపై ఆర్ అండ్ బి అధికారులు స్పందిస్తూ.. గాలి దుమారం కారణంగానే సిమెంట్ గైడర్లు కుప్ప కూలిపోయి ఉంటాయని, పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని చెప్పారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. నాణ్యతాలోపాల కారణంగానే బ్రిడ్జి కూలిపోయింది.. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది.



## మాజీ ఎమ్మెల్యే అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకోవాలి

టీ మీడియా, ఏప్రిల్ 23, వనపర్తి బ్యూరో :
మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జయరాములు స్మారకార్థం ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని, పాత మార్కెట్ యార్డ్లో ఏర్పాటుచేసిన టౌన్ హాల్ ను వినియోగంలోకి తీసుకురావాలని అఖిలపక్ష ఐక్యవేదిక పోరాటం .వనపర్తి జిల్లా కేంద్రంలో కోట్లు పెట్టి కట్టిన పలు కట్టడాలు నిరుపయోగంగా మారాయి కనుక వెంటనే వాటిని ప్రజల అవసరాల కోసం వినియోగంలోకి తేవాలని జిల్లా కలెక్టర్ ని, ఎమ్మెల్యే , ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ లను కోరడం జరుగుతున్నది. పేదవారికి నీడ లేదు కానీ పెద్ద పెద్ద కట్టడాలు మాత్రం వెలిశాయి. కానీ అవి నిరుపయోగంగా ఉన్నాయని. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జయరాములు ని కనీసం తలుచుకొని ఈ నేతలు ఆయన పేరుపై ఉన్న అతిథి గృహాన్ని మాత్రం గుట్టుగా వేరే ఆఫీసులకు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్ మరియు సిపిఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, టిడిపి నాయకులు కొత్త గొల్ల శంకర్ తెలిపారు. ఈ పార్లమెంటు ఎన్నికలు అయిన తర్వాత నైనా ఈ టౌన్ హాల్ ను జయ రాములు అతిథి గృహాన్ని, సమీకృత మార్కెటు హాల్ ను వినియోగంలోకి తీసుకురావాలని లేనియెడల వనపర్తి లోని రాజీవ్ చౌక్ లో నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు. అంతేకాకుండా వందల మంది కార్మికులు పాత మార్కెట్ యార్డులో ఉదయం వచ్చి సాయంత్రం వరకు ఎండలో ఎండి వానలో తడుస్తున్నారని, వారికి కనీస నీడ కల్పించాలని, ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ తో పాటు సిపిఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, టిడిపి రాష్ట్ర యువ నాయకులు కొత్త గొల్ల శంకర్, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు గంధం నాగరాజు,ఏడవెల్లి భాస్కర్, శివకుమార్, రాములు మరియు గంజి హమాలీలు పాల్గొన్నారు.



## స్వామివారి ఆభరణాల ఊరేగింపు

టీ,మీడియా, ఏప్రిల్,23 ఆత్మకూరు:
ఆత్మకూరు మండలం నందిమల్ల గ్రామం లోని శ్రీ చింతల మునిస్వామి బ్రహ్మోత్సవాలు, ఎస్బిఐ బ్యాంకులో భద్రపరిచిన ఆభరణాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్తులు మేళతాళాల తో బాణాసంచ కాలుస్తూ ఊరేగింపుగా ఆభరణాలను తీసుకుని వెళ్లడం జరిగింది ఈ ఆభరణాలను స్వామివారికి అలంకరించి నేటి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు కార్యక్రమంలో, టిపిసిసి రాష్ట్ర కల్లుగీత నాయకులు కేశం నాగరాజు గౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ స్వర్ణమ్మ, సిద్ధార్థ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు, ఎండి రహమతుల్లా, రైచూర్ పరమేష్, నల్గొండ శీను, జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి గంగాధర్ గౌడ్, పిన్నంచర్ల భాస్కర్,వాల్మీకి రాష్ట్ర నాయకులు, ఎస్టిడి శీను, సాయి రాఘవ, రఘు గౌడ్, నందిమల్ల గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు



# జర్నలిస్టులకు ఎమ్మెల్యే హామీ ఓట్ల కోసమేనా

• అక్రిడిటేషన్ సంబంధం లేకుండాస్థలాలు ఇస్తారా ?

• కాడె పాగు అశోక్

టీ మీడియా, ఏప్రిల్ 23, వనపర్తి బ్యూరో :
ఎన్నికల సందర్భంలోని వర్కింగ్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు గుర్తుకొస్తాయా ? జర్నలిస్టుల అక్రిడిటేషన్ సంబంధం లేకుండా ఇళ్ల స్థలాలు పంపిణీ చేయగలరా? గతంలో మంత్రి చేసిన తప్పిదం ఎమ్మెల్యే చేస్తారా? హెచ్ఆర్సీ రైట్ టు ఇన్ఫర్మేషన్ వనపర్తి జిల్లా ప్రెసిడెంట్ కాడె పాగు అశోక్ ప్రశ్నించారు. ఎమ్మెల్యే మెగా రెడ్డి జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో అందరి జర్నలిస్టులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు సమయంలో వనపర్తి జర్నలిస్టులు గుర్తుకొచ్చారా. అని ప్రశ్నించారు ప్రభుత్వాలు మారినప్పుడు జర్నలిస్టులకు అవి కల్పిస్తాం ఇవి కల్పిస్తాం కల్పిస్తామని హామీ ఇవ్వడం తప్ప నెరవేర్చిన ప్రభుత్వాలు లేవని బాధని వ్యక్తం చేశారు. పత్రిక యాజమాని నిబంధన విలేకరులపై రుద్ది అక్రిడేషన్ ఎగనామం పెట్టారని ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతింటున్నాయని అన్నారు. ఈ విధమైన వేతనాలు లేకుండా గౌరవప్రదమైన వృత్తిగా భావించి సామాజిక స్పృహతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలిసేలా ప్రజల పక్షాన నిలిచి ప్రజల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తున్న పత్రికలకు వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి భరోసా కల్పించాలని అన్నారు.గత పాలకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించకుండా వారికి నచ్చిన మెచ్చిన వారికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ సంబంధం లేకుండా ఇష్టానుసారంగా తన నచ్చిన వారికి మెచ్చిన వారికి తొత్తులకు జర్నలిజం లో సంబంధం లేని వారికి ప్లాట్లు పంపిణీ చేసి తీవ్ర విమర్శలకు దారితీశాయి. ఇప్పటికైనా వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి ఇవన్నీ సమస్యలు గుర్తించి వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సంబంధం లేకుండా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అలాగె ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు లబ్ధి చేకూర్చాలని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు సంబంధించిన అర్హతులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్సీ సభ్యులు తదితరులు వర్కింగ్ జర్నలిస్టులు ఉన్నారు.



# దయనీయంగా జీవితాలను వెళ్ళదీస్తున్న ఆర్టీసీ కార్మికులు

టీ మీడియా, ఏప్రిల్ 23, వనపర్తి బ్యూరో :
ఆర్పిఎస్ 2013 బాండ్ ఏరియాస్ ను వెంటనే చెల్లించాలి అని వనపర్తి డిపో బ్యాడ్జీలు ధరించి విధులకు కార్మికులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వనపర్తి ఆర్టీసీ డిపో ముందు యూనియన్ కార్యదర్శి ఏ కృష్ణయ్య మాట్లాడుతూ 2013 వేతన సవరణకు సంబంధించిన బాండు డబ్బులు చెల్లించడంలోజాప్యనికి నిరసనగా, అలాగే 2017 వేతన సవరణ వ్యత్యాసాన్ని లెక్క కట్టి కార్మికునికి ఒక కాపి ఇవ్వాలని అలాగే వాటిని రిటర్మెంట్ సమయంలో కాకుండా తొందరలోనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ 23 .4 24న అందరం కలిసి డిమాండ్ బ్యాడ్జి ధరించి నిరసన కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 10వ తారీఖునే ఆర్టీసీ కార్మికుల బాండుకు సంబంధించిన డబ్బులు 281కోట్లు విడుదల చేశామని చెప్పింది. కానీ యాజమాన్యం మాత్రం విభజించు పాలించు అనే సిద్ధాంతం ప్రకారం డ్రైవర్ ల కు ఒకసారి చెల్లించి మిగతా వారికి మళ్లీ చెల్లిస్తామని చెప్పి మూడు నెలలు గడిచిన ఇంతవరకు మిగతా కార్మికులకు దానికి సంబంధించిన డబ్బులు రాలేదు.చాలిచాలని 2013సం జీతాలతో కడు దయనీయంగా జీవితాలను వెళ్ళదీస్తున్న కార్మికుల జీతాలు గొర్రె తోక బెత్తడు లాగే ఉంటున్నది. ప్రభుత్వం విడుదల చేసిన బాండు డబ్బులు అన్నా గాని సరైన టైంలో వస్తాయని ఆశించిన కార్మికులకు గత మూడు నెలలుగా నిరాశనే మిగులుతున్నది . ఈరోజు రేపు అంటూ ఇంతవరకు చెల్లించలేదు.సం,,రానికీ కార్మికులకు 300రోజుల చాలెంజ్ ఇస్తున్నా యాజమాన్యం వారి ఆర్థిక ప్రయోజనాలను మాత్రం పట్టించుకోవడం లేదు.అలాగే 2017సం,,రానికి సంబందించి ఎరియర్స్ లెక్కించి కార్మికుల పీ కేస్ లో వ్యక్తి గతంగా కాపీలు ఇయ్యాలని డీమాండు చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి ఏ కృష్ణయ్య ప్రచారం కార్యదర్శినాగేశ్వర్ డిపో సహాయ కార్యదర్శి బి కృష్ణ డిపో కమిటీ సభ్యులు కే శ్రీనివాసులు. మహిళా కండక్టర్లు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు ఎస్ డబ్ల్యూ ఎఫ్ వనపర్తి డిపో కమిటి సభ్యులు పాల్గొన్నారు.



## మండల సర్వసభ్య సమావేశం వాయిదా

టీ మీడియా, ఏప్రిల్ 23, మహానంది:
మహానంది మండలం సర్వసభ్య సమావేశం ఎంపీటీసీ సభ్యులు హాజరుకానందున వాయిదా వేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తిమ్మాపురం గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించామని,ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు హాజరుకానందున, వాయిదా వేయడం జరిగిందని తెలిపారు.ప్రజల సమస్యలను అధికారుల ముందు ప్రస్తావించి, సమస్యలను పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిన, ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడం వారి చిత్తశుద్ధిని, మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

టీ మీడియా, ఏప్రిల్ 23, గోదావరిఖని ప్రతినిధి:
సేవకు కేరాఫ్ అడ్రస్ డాక్టర్ సురభి శ్రీధర్ అని, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల ఫౌండర్ అండ్ చైర్మన్ , డాక్టరేట్ అవార్డు గ్రహీత .డాక్టర్ సురభి శ్రీధర్ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. వివిధ రంగాలలో సేవలు చేసిన సేవకులను గుర్తించి వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో , ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని. మానవత వెలుగు ఉగాది పురస్కారాలు 2024 అందించడం జరిగింది. గోదావరిఖని మార్కండేయ కాలనీ దుర్గా నగర్ లోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ లో ఉగాది పర్వదిన పురస్కరించుకొని వివిధ రంగాలలో సేవలందించిన సేవకులను గౌరవిస్తూ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ (వి.ఎస్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో 100 మంది సామాజిక సేవకులకు మానవత వెలుగు ఉగాది పురస్కారాలను 2024 అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగరేణి సంస్థ ఆర్జీ1 జిఎం చింతల శ్రీనివాస్, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షులు పెద్దంపెట్ శంకర్, సంస్థ ప్రధాన కార్యదర్శి, సిహెచ్ కిషన్ రావు, లైన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ కజాంపురం రాజేందర్,
. నక్షత్ర గ్రూప్ ఇన్ఫ్రా డెవలపర్స్ చైర్మన్ చిర్రా రాజు. జి అనిల్. హాజరై మాట్లాడారు ఉభయ తెలుగు రాష్ట్రాలలో వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సురభి శ్రీధర్ చేస్తున్న సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. తన సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా పలు రంగాలలో సేవలందిస్తున్న సేవకులను గౌరవిస్తూ మానవత వెలుగు పురస్కారాలను వంద మందికి అందించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సురభి శ్రీధర్ సేవలు మరింత ముందుకు సాగాలని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవలకు తమ వంతు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం డాక్టర్ సురభి శ్రీధర్ మాట్లాడారు. వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవకులకు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని తెలిపారు. తన సంస్థ సహకరించిన ప్రతి ఒక్కరి తో పాటు సామాజిక సేవలు చేస్తున్న సామాజిక సేవకులను గౌరవించుకుంటూ వందమంది తన సంస్థ ఆధ్వర్యంలో మానవత వెలుగు 2024 పురస్కారాలను అందించడం జరిగిందని తెలిపారు.ఈ అవార్డుల కార్యక్రమం చేయడానికి సహాయం సహకారాలు అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ ఆర్గనైజర్స్ , అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.



## ఆంజనేయ గుడిలో నీలం మధు పూజలు

టీ మీడియా, ఏప్రిల్ 23 ,పటాన్చెరువు:
నియోజవర్గం గుమ్మడిదల మండలం మంభాపూర్ ఆంజనేయ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నర్సింగ్ రావు, నరసింహారెడ్డి,ప్రతాప్ రెడ్డి,మహిపాల్ రెడ్డి,ఆంజనేయులు,నర్సింలు,మల్లేష్, గోపాల్,, సాయి చందర్,వినోద్, తదితరులు పాల్గొన్నారు.



# అనుమతి లేకుండా అక్రమ వెంచర్లు..

• ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

**టీ మీడియా ,ఏప్రిల్ 23,ఉప్పునుంతల :**



వ్యవసాయ భూములను నివాస ప్రాంతాలుగా మార్చడం కోసం నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. అనధికార వెంచర్లపై కఠిన చర్యలు తీసుకునే నాదుడే లేకపోవడంతో ఒక వెంచర్ పాతిక ప్లాట్లుగా నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం లక్ష్మాపూర్ (పి. జి)గ్రామంలో బీటీ రోడ్డు పక్కన నివాస గృహాల మధ్యలో ఉన్న ఒక ఎకరా 20 గుంటల వ్యవసాయ భూమిలో రాళ్లు పాతి పెయింట్ వేసి క్రమ సంఖ్య నెంబర్లు వేసి సెటర్ బిట్లు, ప్లాట్లు, రోడ్లు వదిలి రియల్ దందా కొనసాగుతోంది. ప్లాట్ల యజమాని గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం అగ్రికల్చర్ భూములను నాన్ అగ్రికల్చర్ భూములుగా మార్చకుండానే ఇష్టారాజ్యంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నట్లు విమర్శలు ఎల్లువెత్తుతున్నాయి. ప్లాట్లు కొనుగోలుదారులకు విక్రయించి ఒక కుంట రెండు కుంటల చొప్పున ధరణిలో పట్టా చేస్తామన్నట్లు గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. కొంతమంది రెవెన్యూ అధికారుల అండదండలతోనే వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేయడం మూలంగా ప్రభుత్వ ఆదాయానికి తీవ్ర గండి పడుతుంది అనుమతులు లేని వెంచర్లపై అధికారులు కోరడ ఝులిపిస్తూనే అమాయకులు వారి ఉచ్చులో పడకుండా జాగ్రత్త తీసుకునే అవకాశం ఉంది. అప్రమత్తమైన గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంచర్ సందర్శించి ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లు చేసిన వెంచర్ యజమానులకు నోటీసులు ఇచ్చారు. లక్ష్మాపూర్ (పి.జి) గ్రామ పరిధిలో వెంచర్ ఏర్పాటు చేసింద్రు వాస్తవమే గ్రామపంచాయతీని ఎలాంటి అనుమతులు కోరలేదు. గ్రామపంచాయతీ పర్మిషన్ లేకుండా లే-అవుట్ నిర్మాణం చేపట్టారు. పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం గ్రామపంచాయతీ అనుమతి లేకుండా లే-అవుట్లు చేయడం చట్ట విరుద్ధం కనుక వెంచర్ యజమానులకు గ్రామపంచాయతీ నుండి నోటీసులు ఇవ్వడం జరిగింది. %-% లక్ష్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి, నరసింహ. వ్యవసాయ భూమిని నాలా కన్వర్షన్ కి మార్చుకొని డీటీసీపీ పర్మిషన్ పొంది ఉండాలి ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇండ్ల నిర్మాణాలు చేపట్టరాదు. ధరణి రిజిస్ట్రేషన్ 5 గుంటలు పైన ఉంటే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు కానీ ఒక గుంట ధరణిలో రిజిస్ట్రేషన్ కొరకు వస్తే ల్యాండ్ సైటును రెవెన్యూ నుంచి సందర్శించి భూమి రిజిస్ట్రేషన్ కు అర్హులు అయితే రిజిస్ట్రేషన్ చేస్తాం, నిబంధనలకు విరుద్ధమైతే రిజిస్ట్రేషన్ చేయకుండా నిలిపివేస్తాం %-% ఉప్పునుంతల తాహసిల్దార్, శ్రీకాంత్.

## శ్రీ జోధాంజనేయ స్వామి దర్శించుకున్న మంత్రి, ప్రభుత్వ విప్..

**టీ మీడియా ,ఏప్రిల్ 23,వేములవాడ :**



మండలం అగ్రహారం శ్రీ జోధాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి పునస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారికి దేవాలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పించారు, అనంతరం స్వామివారి మేమెంటో, ప్రసాదాన్ని అందజేశారు. హనుమాన్ దేవాలయంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో మారుతి తెలియజేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కొరకు మై వేములవాడా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 200 క్యాన్ల చల్లటి నీరును, అదేవిధంగా 3000 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు మైవేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, గొంగళ్ళ రవికుమార్, డాక్టర్. బెజ్జంకి రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, గుమ్మడి కుమార్, డాక్టర్. కళా అశోక్, గొండ ప్రసాద్, పసూల శ్రీనివాస్, పొలాస రాజేందర్, చొక్కాల వనజ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా ఎండీ రఫీక్..

**టీ మీడియా ,ఏప్రిల్ 23,వేములవాడ:**



ప్రెస్ క్లబ్ (టియుడబ్లుజే హెచ్ 143) అధ్యక్షుడిగా మహ్మద్ రఫీక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం వేములవాడ లోజరిగిన ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా ఎండి రఫీక్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కే. నర్సయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన మహమ్మద్ రఫీక్ మాట్లాడుతూ నిరంతరం విలేకరుల సంక్షేమం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. జర్నలిస్టులకు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలపై ముందుండి పోరాటం చేస్తామన్నారు. త్వరలోనే ప్రెస్ క్లబ్ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాయక్ పాషా, సీనియర్ జర్నలిస్టులు తాహెర్ పాష, రేగుల రాంప్రసాద్, విలేకరులు రసూల్, శ్రీనివాస్, అలీ, జితేంద్ర, కనక రెడ్డి, శ్రీహరి, కమలాకర్, బోనాల రవి, వేణు, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## నేరెళ్ల పీహెచ్ సీ ని తనిఖీ చేసిన కలెక్టర్

- వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి

**టీ మీడియా ,ఏప్రిల్ 23,తంగళ్ళపల్లి:**



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.తంగళ్లపల్లి మండలం నేరెళ్ల పీహెచ్ సీ ని కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానకు వస్తున్న ఓపీ వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళా కింద ఎంత మందికి పరీక్షలు చేశారు? వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని డాక్టర్ ను అడిగారు. అనంతరం దవాఖానకు నిత్యం ఎంత మంది రోగులు వస్తున్నారు? వారికి ఏ ఏ పరీక్షలు చేస్తున్నారు, వడ దెబ్బ కేసులు ఏమైనా నమోదు అయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. ఓఆర్ఎస్ పాకెట్స్ నిల్వల వివరాలు సే కరించారు. అనంతరం క్యాన్సర్, బీపీ, షుగర్ పేషంట్స్ ఎవరైనా ఉన్నారా.. వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. గత నెలలో ఎన్ని డెలివరీలు అయ్యాయని తెలుసుకోగా, 23 అయ్యాయని, 14 ప్రభుత్వ ఆసుపత్రిలో, 9 ప్రైవేటు ఆసుపత్రిలో అయినట్లు వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట డీఎంహెచ్ఓ సుమన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ రజిత, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఉమాదేవి, డీడీఎం కార్తీక్, మెడికల్ ఆఫీసర్ రేఖ, ఎంఎల్ హెచ్ పీ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.


డిజిటల్ మీడియాలో అగ్రగ్రామిగా ఉన్న
స్పాట్ న్యూస్ స్పీడ్‌గా అందించే టీ-మీడియాలో
పనిచేయడానికి, జిల్లా, నియోజక వర్గ, మండల
ఇంచార్జీలు, విలేకరులు కావలెను.
విలేకరులు కావలెను.
T MEDIA
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత
కొత్తవారికి అవకాశం ఉంటుంది.
ఆసక్తి కలవారు తమ వివరాలను క్రింది నెంబర్లకు పంపండి
8500515365, 7382990365, 8919710365


# ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిపై వీడిన సస్పెన్స్

• అధికారిక ప్రకటనే తరువాయి

**టీ మీడియా ,ఏప్రిల్ 23,ఖమ్మం:**



పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచేది ఎవరనే విషయంపై పార్టీ అధిష్టానం స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించిన రామ సహాయం రఘురాంరెడ్డికి టికెట్ ఇచ్చేందుకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతుంది. దీంతో రామ సహాయం రఘురాంరెడ్డి తరపున కాంగ్రెస్ నేతలు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. రామసహాయం రఘురాం రెడ్డికి చెందిన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను మద్దినేని స్వర్ణ కుమారి, నిరంజన్ రెడ్డి, బొర్రా రాజశేఖర్, నూకల నరేష్ రెడ్డి, రామ్మూర్తి నాయక్, ఎండీ ముస్తఫా, మలీదు జగన్, జొన్నగడ్డ రవి, రమేష్ లు దాఖలు చేశారు. ఇదిలాఉంటే.. ఇవాళ సాయంత్రం గాంధీ భవన్ లో 14 మంది అభ్యర్థులకు ఏఐసీసీ తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి దీపా దాస్ మున్షి బీఫాంలు అందించనున్నారు. మిగిలిన మూడు నియోజకవర్గాల్లో ఖమ్మం రామ సహాయం రఘురామిరెడ్డి, కరీంనగర్ వెలిచాల రాజేందర్ రావు, హైదరాబాద్ సమీర్ ఉల్లాకు అధిష్టానం టికెట్ కన్ఫామ్ చేయగా.. సాయంత్రం అధికారికంగా ప్రకటన వచ్చిన తరువాత.. వారుకూడా బీఫాంలు అందుకోనున్నారు.ఖమ్మంలోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసేందుకు పలువురు ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. నియోజకవర్గం నుంచి తమ వర్గీయులను బరిలో నిలుపుకునేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రయత్నించారు. పొంగులేటి తన సోదరుడు ప్రసాద్ రెడ్డి, తన బంధువు రామ సహాయం రఘురాం రెడ్డి పేర్లను అధిష్టానం ముందు ఉంచగా.. భట్టి విక్రమార్క తన సతీమణి నందికి పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్టానంను కోరారు. ఒకవేళ నందినికి టికెట్ ఇవ్వని పక్షంలో కాంగ్రెస్ సీనియర్ నేత రాయల నాగేశ్వరరావుకు ఖమ్మం లోక్ సభ టికెట్ ఇవ్వాలని అధిష్టానకు సూచించారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీనియర్ నేత, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు పేరును తెరపైకి తెచ్చినట్లు తెలిసింది. అయితే, కాంగ్రెస్ అధిష్టానం ప్రసాద్ రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, రాయల నాగేశ్వరరావు పేర్లను పరిగణలోకి తీసుకున్నట్లు, వీరిలో ఒకరి పేరును ప్రకటిస్తుందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటూ వచ్చారు. తాజాగా, పొంగులేటి వియ్యంకుడు రామ సహాయం రఘురాంరెడ్డికే టికెట్ కన్ఫార్మ్ అయినట్లు తెలుస్తోంది. ఆ కారణంగానే ఆయన తరుపున పార్టీ నేతలు నామినేషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తమ వర్గీయులను అభ్యర్థులుగా బరిలోకి దింపేందుకు భట్టి, పొంగులేటి తీవ్ర ప్రయత్నాలు చేశారు. పొంగులేటి సూచించిన వ్యక్తి రఘురాంరెడ్డికే అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆయన పేరును ఈరోజు, రేపు అధిష్టానం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. తెలంగాణలో మొత్తం 17 నియోజకవర్గాలు ఉన్నాయి. ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించిన స్థానాల్లో కమ్మ సామాజిక వర్గానికి కాంగ్రెస్ అధిష్టానం ప్రాధాన్యత కల్పించలేదు. ఖమ్మం నియోజకవర్గం నుంచి ఆ సామాజిక వర్గం వ్యక్తికి అధిష్టానం అవకాశం ఇస్తుందని భావించారు. కానీ, ఖమ్మం నుంచికూడా అవకాశం లేదని తెలుస్తోంది.

## ఓడేడ్ బ్రిడ్జిపై విచారణ చేస్తాం

• రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల

**టీ మీడియా ,ఏప్రిల్ 23,మల్హర్ రావు:**



పెద్దపల్లి ముత్తారం మండలంలోని ఓడేడ్, భూపాలపల్లి జిల్లాలోని గర్మిళ్లపల్లి మానేరుపై నిర్మాణ పనుల్లో ఉన్న వంతెన ఇటీవల భారీ గాలి బీభత్సంతో కుప్ప కూలిపోవడంపై తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల,శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మండిపడ్డారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కట్టిన కాళేశ్వరం తోపాటు పలు బ్రిడ్జీలు నాణ్యత లోపంతో నిర్మాణ పనులు చేపట్టారన్నారు. గుత్తేదారులు ఇచ్చే కమిషన్లకు బిఆర్ఎస్ నాయకులు కక్కుర్తి పడటంతో పనుల్లో నాణ్యత ప్రమాణాలను కాంట్రాక్టర్లు గాలికొదిలేశారన్నారు. సీఎం రేవంత్ దృష్టికి తీసుకపోయి ఓడేడ్ బ్రిడ్జిపై విచారణ చేపట్టి బాధితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణం కొనసాగుతున్న ఓడేడ్ బ్రిడ్జి బెండ్లు గాలికి కులడంపై పనుల్లో ఎంత నాణ్యత ఉందొ తెలుస్తోందన్నారు. బ్రిడ్జి కూలిన సమయంలో జనం లేకపోవడంతో ఊపిరి పీల్చున్నారని లేదంటే ప్రాణనష్టం జరిగేదన్నారు. ఖమ్మంపల్లి తాడిచెర్ల మానేరుపై నిర్మాణం చేపట్టిన వంతెనపై రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో అధికారులు బ్రిడ్జిని పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ పాల్గొన్నారు.

## అడవుల్ని అక్రమపోడు

• కబ్జాలతో కుంచించుకు పోతున్న అడవులు

• నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**టీ మీడియా ,ఏప్రిల్ 23, తాడ్వాయి:**



అడవి.. తనను నమ్ముకున్నోళ్లకు, అమ్ముకున్నోళ్లకు మధ్య నలిగిపోతుంది. ఆక్రమణలు దౌర్జన్యాలు అటవీక చేష్టలకు చిక్కి శల్యమైపోతూ అరణ్య రోధన చేస్తుంది. పలుకుబడి గల పెద్దలు రాజకీయ ముసుగులోని స్థానిక నాయకులు, కబ్జాదారులు 'వనా' లను లేకుండా చేస్తున్నారు. వన జీవన విధానాన్ని నాశనం చేస్తూ, అడవులను నరికేస్తూ అడవుల నరికేస్తూ, ఆక్రమిస్తూ రకరకాల ముసుగుల్లో పర్యావరణ విధ్వంసాన్ని సృష్టిస్తున్నారు. తెలంగాణలో మొత్తం అటవీ విస్తీర్ణం 26.9 లక్షల హెక్టార్లు (24 శాతం). ప్రభుత్వం దీన్ని 33% పెంచాలని లక్ష్యంతో హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఓ పక్క ఇటువంటి ప్రయత్నాలు జరుగుతుంటే మరొక అడవి భూముల ఆక్రమణ, చెట్ల నరికివేత వంటి ఘటనలు పర్యావరణం తీవ్రంగా నష్టపోతుంది. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం బయ్యక్కపేట్ అటవీ ప్రాంతంలో విచ్చలవిడిగా ఇష్ట రాజ్యాంగా అడవులను నరికి పోడు కబ్జా కోరల్లో నలిగిపోతుంది. బయ్యక్కపేట్ రహదారి వెంట సారలమ్మ గుంపుకు పోయే దారిలోని అడవి ప్రాంతం టేకు చెట్లు, వనాలు పూర్తిగా నరికి ధ్వంసం చేస్తున్నారు. అడవుల్ని ఇష్టారాజ్యంగా నరికి, యదేచ్ఛగా అక్రమంగా పోడు చేసుకుని కబ్జాలకు పాల్పడుతున్నారు. ఫారెస్ట్ అధికారులు, స్థానిక నాయకుల కనుసందలోనే అడవిని నాశనం చేస్తున్నట్లు తెలిసింది. అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి అడవి నాశనం అయిన చూసుకుంటూ అంటిమట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి క్షేత్రస్థాయిలో ఎంక్వయిరీ చేసి అడవులను నరుకుతున్న వారిపై చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకోవాలని, అడవి నాశనానికి పరోక్షంగా ప్రత్యక్షంగా కారకులవుతున్న అటవీశాఖ అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని వన ప్రేమికులు కోరుతున్నారు.

## వైభవంగా దుర్గామాత వేడుకలు

**టీ మీడియా ,ఏప్రిల్ 23,పెద్దవంగర:**



మండలంలోని పడమటి తండాలో దుర్గామాత వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. తండావాసులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో ఎంపీపీ బొమ్మెరబోయిన కల్పన రాజు యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుర్గమాత ఆశీస్సులతో మండల ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, పాలకుర్తి దేవస్థానం మాజీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, ఎంపీటీసీ సభ్యులు బానోత్ రవీందర్ నాయక్, బానోత్ విజయ, నాయకులు సోమన్న, నగేష్, బానోత్ వెంకన్న, ఎర్ర వెంకన్న, సీతారాం నాయక్, వేణు, సుధీర్, రాజేందర్ నాయక్, పటేల్ నాయక్, హరీష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## నిరుపయోగంగా డంపింగ్ యార్డు

• ఎస్సీ కాలనీ సమీపంలో పేరుకుపోయిన చెత్త

• జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

**టీ మీడియా ,ఏప్రిల్ 23,కోహెడ:**

మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో డంపింగ్ యార్డు నిరుపయోగంగా మారిందని మంగళవారం ఎస్సీ కాలనీ వాసులు జిల్లా కలెక్టర్, డీపీఓలకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో గత ఐదు సంవత్సరాల క్రితం డంపింగ్ యార్డు నిర్మించినప్పటికి నిరుపయోగంగా మారిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే నిర్మించిన షెడ్డులో ట్రాక్టర్లను, ఆవులను కట్టివేసేందుకు ఉపయోగిస్తున్నారన్నారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తను, వ్యర్థలను ఎస్సీ కాలనీ ఇండ్ల సమీపంలో వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యర్థల దుర్వాసనతో కాలనీ వాసులు పలు రకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. లక్షలు వెచ్చించి డంపింగ్ యార్డులను నిర్మించినప్పటికి వాటిని వినియోగించకుండా నిరుపయోగంగా ఉంచడంపై అంతర్యమేమిటన్నారు. దీనికి గాను సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరగా జిల్లా కలెక్టర్, డీపీవోలు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు చిట్యాల అశోక్, చెప్యాల వెంకటయ్య, రమేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ ని దర్శించుకున్న కేశం నాగరాజు గౌడ్

**టీ.మీడియా, ఏప్రిల్, 23 ఆత్మకూరు:**

పట్టణ కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.తీర్థ ప్రసాదాలు స్వీకరించిన టి పి సి సి రాష్ట్ర కల్లుగీత నాయకులు కేశం నాగరాజు గౌడ్, అనంతరం ఆలయ పూజారి కేశం నాగరాజు గౌడు,కు ఆలయ సంప్రదాయం ప్రకారం శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో, ఎండి రహమతుల్లా,రైచూర్ పరమేష్,నల్గొండ శీను, తులసిరాజ్ యాదవ్, మొగిలి గంగాధర్ గౌడ్, అజ్మతుల్లా, తాండూర్ సుదర్శన్, ఎస్టిడిశీను,రఘు గౌడ్, సాయి రాఘవ, తదితరులు పాల్గొన్నారు

## నేటినుంచి మే 10 వరకు కేసీఆర్ బస్సుయాత్ర

**టీ మీడియా ,ఏప్రిల్ 23,హైదరాబాద్:**





బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కే.చంద్రశేఖర్ రావు రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్ర రేపు (బుధవారం) 24వ తేదీన ప్రారంభం కానుంది. ఈ బస్సు యాత్ర మే 10వ తేదీ వరకు కొనసాగనుంది.సుమారు 17 రోజుల పాటు సాగే ఈ యాత్రకు ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వడంతో పార్టీ అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. మిర్యాలగూడలో ప్రారంభమైన యాత్ర సిద్ధిపేటలో బహిరంగ సభతో ముగియనుంది. లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కేసీఆర్ బస్సుయాత్ర ప్రారంభించారు. దాదాపు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం, ఒకటి రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోడ్ షోలు నిర్వహించే విధంగా బస్సు యాత్రను ప్లాన్ చేశారు. తమ నియోజకవర్గాల్లోనూ కేసీఆర్ బస్సుయాత్ర చేయాలని వివిధ నియోజకవర్గాల నేతల నుంచి డిమాండ్ ఉంది. అయితే సమయాభావం, ఎండ వేడిమిని దృష్టిలో ఉంచుకుని పలు నియోజకవర్గాల్లో మాత్రమే బస్సుయాత్ర చేపట్టాలని నిర్ణయించారు. కేసీఆర్ యాత్ర పొడవునా 100 మందికి పైగా వాలంటీర్లు వాహన శ్రేణి వెంట రానున్నారు. ఇప్పటికే ఎంపికైన వారికి సోమవారం తెలంగాణ భవన్‌లో అవగాహన కల్పించారు. తొలిరోజైన బుధవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందుగా తెలంగాణ భవన్‌కు చేరుకుంటారు. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ క్యాడర్, నేతలతో భేటీ కానున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత నల్గొండ జిల్లా మిర్యాలగూడలో తొలిరోడ్డు షోలో పాల్గొనేందుకు బయల్దేరి వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, ప్రజలు ఉత్సాహంగా, స్వచ్ఛందంగా పాల్గొనేందుకు ముందుకు వస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు. దీంతో ప్రజలు పెద్దఎత్తున నిలబడి ప్రసంగాన్ని దూరం నుంచి వినేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు ప్రజల్లో భారీ స్పందన వస్తుందని స్పష్టంగా భావిస్తున్నారు.

## డబుల్ డిజిట్ ఎంపీ సీట్లలో.. గెలుపే లక్ష్యం

• నామినేషన్లకు హాజరవుతోన్న జాతీయ నేతలు

**టీ మీడియా, ఏప్రిల్ 23,ఢిల్లీ:**



డబుల్ డిజిట్ సీట్లే టార్గెట్‌గా తెలంగాణ భారతీయ జనతా పార్టీ దూకుడు పెంచింది. అభ్యర్థుల నామినేషన్‌కు జాతీయ నేతల రాకతో కమలం పార్టీలో ఇప్పటికే జోష్ కనిపిస్తోంది. అలాగే అగ్రనేతలతో కూడా ఎక్కువ సభలు నిర్వహించి.. 10కిపైగా ఎంపీ సీట్లు గెలవాలని రాష్ట్ర నేతలు ప్లాన్ చేస్తున్నారు.తెలంగాణపై బీజేపీ హైకమాండ్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలో డబుల్ డిజిట్ ఎంపీ సీట్లలో గెలుపే లక్ష్యంగా దూసుకెళ్తోంది. ఇప్పటికే నామినేషన్ కోసం బీజేపీ అభ్యర్థులు పెద్ద ఎత్తున ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, జాతీయ నేతలు హాజరవుతున్నారు.సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా కిషన్ రెడ్డి నామినేషన్ వేయగా.. కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి పియూష్ గోయల్, ఎంపీ లక్ష్మణ్ హాజరైయ్యారు. ఇవాళ భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బూర నర్సయ్య గౌడ్ నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి జైశంకర్ హాజరవుతారు.మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎల్లుండి తెలంగాణలో పర్యటిస్తారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్ధిపేటలో బహిరంగ సభకు హాజరుకానున్నారు అమిత్ షా. పార్టీ శ్రేణులతో సమావేశమై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నారు. మే ఫస్ట్ వీక్‌లో ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా తెలంగాణలో పర్యటించనున్నారు. ప్రధాని మోదీతో పాటు అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో వీలైనన్ని ఎక్కువ సభలు, రోడ్ షోలు నిర్వహించేలా బీజేపీ రాష్ట్ర నేతలు ప్లాన్ చేస్తున్నారు.దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో ఎన్నికలు జరుగనుండగా.. నాలుగో దశలో మే 13న తెలంగాణలో పోలింగ్ జరగనుంది. జూన్ 4న కౌంటింగ్ నిర్వహిస్తారు.